సాక్షి మహబూబ్‌నగర్

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



అర్ధరాత్రి వేళ..

అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో భూ పత్రాలు తారుమారు చేసే యత్నం జరిగింది.

వివరాలు 8లో ▸



గవర్నర్‌కు ఆహ్వానం

జోగుళాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు గవర్నర్ తమిళిసైను ఆహ్వానించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
38.2 /16.8

వాతావరణం

కొంత మేర మేఘాలు ఉంటాయి. తేమ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మార్పులకు అనుగుణంగా పనిచేయాలి: ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా పోలీస్ వ్యవస్థ బాలల రక్షణ కోసం నిత్యం పని చేయడం జరుగుతుందని ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. శిశు సంక్షేమ శాఖ, సమగ్ర బాలల సంరక్షణ సేవ ఆధ్వర్యంలో చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది, పోలీస్ సిబ్బందికి, బాలల సదనం, సీడబ్ల్యూసీ, జేజేబీ, ఐసీడీఎస్, డీసీపీయూ సిబ్బందికి శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాలల న్యాయ చట్టం 2015, లైంగిక నేరాలు–బాలల రక్షణ చట్టం 2012లో వచ్చిన సవరణలు, మార్పులపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టంలో వచ్చిన మార్పుల అనుగుణంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారి చిత్తరంజన్, ఏఎస్పీ రాములు, డీసీఆర్‌బీ డీఎస్పీలు, లక్ష్మణ్, రమణారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిని జ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ యాదయ్య, డేవిడ్‌రాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

11న హ్యాండ్‌బాల్ పోటీలు

జడ్చర్ల: కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఈనెల 11న ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ తెలిపారు. సీనియర్ బాలబాలికల విభాగాలకు సంబంధించి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 99485 85065 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రతి హామీ అమలుచేస్తాం

- అసెంబ్లీలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



స్టేషన్ మహబూబ్‌నగర్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలుచేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం తెలియజేసే తీర్మానంపై చర్చ సందర్భంగా యెన్నం మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. మహబూబ్‌నగర్‌లోని బీసీ సంక్షేమ బాలికల హాస్టల్‌లో 350 మంది విద్యార్థులు ఉండగా.. అద్దె భవనంలోని ఒక్కో గదిలో 15నుంచి 20 మంది విద్యార్థులు ఉంటూ అవస్థలు పడుతున్నారని తెలిపారు. మేము నంబర్‌వన్ అని గత ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటనలు ఇచ్చిందే తప్ప చేసిందేమీలేదని విమర్శించారు. పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన చర్యలు ఏమీలేవన్నారు. 40–50 ఏళ్ల క్రితం నిర్మించిన శ్రీశైలం, జూరాల లాంటి ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని.. రూ.లక్ష కోట్లతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ వద్ద కూలిపోతుందని విమర్శించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



దేవరకద్ర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి, మెరుగైన విద్య అందిస్తున్నట్లు డీఈఓ ఎ.రవీందర్ అన్నారు. విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులను పంపిణీచేశారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థులను అన్నివిధాలా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నట్లు వివరించారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉపాధ్యాయుడు అశ్విని చంద్రశేఖర్ రూపొందించిన నీతికథల కార్డులను డీఈఓ ఆవిష్కరించారు. చదువు ప్రాముఖ్యతపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాన్ని చూసి అభినందించారు. కార్యక్రమంలో జేఎస్టీయూ ప్రా. విజయలక్ష్మి, ఎంఈఓ శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, విద్యాభివృద్ధి వేదిక ప్రతినిధులు నరేందర్, సత్యనారాయణ, శివకుమార్, హేమచంద్రుడు, లత, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశల పల్లకిలో

రాష్ట్ర బడ్జెట్‌పై పాలమూరు వాసుల ఆశలు

- పెండింగ్‌లో పాలమూరు–రంగారెడ్డి, ఇతర సాగునీటి ప్రాజెక్టులు
- ఆలయాల అభివృద్ధికి కరువైన నిధులు
- పర్యాటక అభివృద్ధికి నిధులే కీలకం
- సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో సర్వత్రా ఆసక్తి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి,నాగర్‌కర్నూల్: రాష్ట్ర శాసనసభలో శనివారం ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లావాసుల్లో నిధుల కేటాయింపుపై ఆశలు నెలకొన్నాయి. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, భూసేకరణలో సమస్యలు, ప్రధాన ఆలయాల అభివృద్ధి, పర్యాటక రంగాలపై భారీ అంచనాలు ఉన్నాయి. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడం, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్‌పై రైతులు, మహిళలు, వ్యాపారులు, పేద, మధ్య తరగతి వర్గాలకు దక్కనున్న ప్రయోజనంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పెండింగ్‌లోనే సాగునీటి ప్రాజెక్టులు..

ఉమ్మడి జిల్లాలో చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ఇంకా పూర్తికాలేదు. ఇప్పటివరకు కేవలం 55శాతం మాత్రమే పనులు పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు పురోగతికి పూర్తిస్థాయి నిధులను వెచ్చించాల్సి ఉంది. బడ్జెట్‌లో ఈ మేరకు కేటాయింపులు ఉంటాయని ఉమ్మడి జిల్లావాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితేనే రైతులకు ప్రయోజనం చేకూరనుంది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద కాల్వల మరమ్మతులు, నిర్వహణకు నిధులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో చివరి ఆయకట్టు రైతులకు ఈ ప్రాజెక్టు ఫలాలు దక్కడం లేదు. అలాగే భీమా, మార్కండేయ, ఉమామహేశ్వర, చెన్నకేశవ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు జరగాల్సి ఉంది.



ఆలయాల అభివృద్ధికి నిధులే కీలకం..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దేవాదాయ శాఖ అధీనంలో మొత్తం 49 ప్రధాన ఆలయాలు ఉన్నాయి. వీటిలో 6ఏ కింద 15, 6బీ కింద 15, 6సీ కింద 18, 6డీ కేటగిరీ కింద ఒక ఆలయం ఉన్నాయి. వీటిలో ప్రధానంగా జోగుళాంబ ఆలయంలో సౌకర్యాలు మెరుగుపడాల్సి ఉంది. ఇక్కడి ఆలయం పురావస్తు శాఖ అధీనంలో ఉండటంతో నిర్వహించాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధిత శాఖ అనుమతులు పొందాల్సి ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నా ఇక్కడి పరిస్థితి మాత్రం మెరుగుపడటం లేదు. ఇందుకు తగిన విధంగా నిధుల కేటాయింపులు ఉండటం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మన్నెంకొండ, ఉమామహేశ్వరం, మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి, సోమశిల, కురుమూర్తిస్వామి తదితర ఆలయాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని జిల్లావాసులు కోరుతున్నారు.

నల్లమల, కృష్ణాతీర ప్రాంతాల్లో సౌకర్యాలు మెరుగుపడేనా?

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా నల్లమల అటవీప్రాంతంతో పాటు కృష్ణానది తీరప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లాకే చెందిన జూపల్లి కృష్ణారావు పర్యాటక, పురావస్తు శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పర్యాటక రంగ అభివృద్ధికి అనుగుణంగా కేటాయింపులు ఉంటాయని, సౌకర్యాలను పెంచుతారన్న అంచనాలు ఉన్నాయి. నల్లమల టైగర్ రిజర్వ్ ప్రాంతంతో పాటు కృష్ణాతీర ప్రాంతాలు, మన్నెంకొండ వద్ద రోప్‌వే, ఇతర రిజర్వాయర్ల వద్ద బోటింగ్, కాటేజీల వసతి, పర్యాటకులను ఆకర్షించేందుకు ఎకో టూరిజం, సౌకర్యాలను మరింత విస్తృత పర్చాల్సి ఉంది. తద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలను పెంచే దిశగా ప్రణాళిక సాగాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సంక్షేమానికి సింహభాగం నిధులు

కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించాల్సి ఉంది. ప్రధానంగా పెన్షన్లు, రైతు భరోసా, మహిళలకు భరోసా, ఉచిత విద్యుత్ అమలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో పాటు ప్రభుత్వం హామీ ఇచ్చిన పథకాలు, సంక్షేమంపై ఆశలు నెలకొన్నాయి. వీటి అమలుకు భారీగా నిధులు అవసరం కానున్నాయి.

మన్యంకొండలో వసతులు కల్పించాలి..



మన్యంకొండ క్షేత్రంలో భక్తులకు అన్నదాన సత్రం, వసతి గృహాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. గుట్టపై యాత్రికులు సేద తీరేందుకు ప్రత్యేక హాల్ నిర్మించాలి. పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు గుట్టపైకి వెళ్లేందుకు రోప్‌వే ఏర్పాటు చేయాలి. ఉమ్మడి జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలి.

– శివకుమార్, మహబూబ్‌నగర్

సీజీఎఫ్‌కు అధిక నిధులు కేటాయించాలి..



చారిత్రక నేపథ్యం కలిగిన ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం అందించే కామన్ గుడ్ ఫండ్‌కు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.200కోట్లు కేటాయించాలి. ప్రస్తుతం సమాజంలో భక్తి భావన పెరిగింది. గతంతో పోలిస్తే ఆలయాల సంఖ్య పెరిగింది. అందుకు తగ్గట్టు ప్రభుత్వం కూడా బడ్జెట్ కేటాయించాలి.

– జినుంపల్లి జయపాల్‌రెడ్డి, ఎంప్లాయిస్ ప్రెసిడెంట్, దేవాదాయశాఖ

ఈ సారైనా నిధులు వచ్చేనా..



ప్రియదర్శిని జూరాల ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న భీమా కాల్వలకు లైనింగ్ లేకపోవడంతో సమీప పొలాలు సీఫేజ్ అవుతున్నాయి. పంటలు పండించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సారి బడ్జెట్‌లో కాల్వ లైనింగ్ పనుల కోసం నిధులు మంజూరు చేసి, రైతులను ఆదుకోవాలి.

– జయసింహారెడ్డి, రైతు సంఘం నాయకుడు, అమరచింత

'పాలమూరు'కు ప్రాధాన్యం ఇవ్వాలి..



పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో ఉమ్మడి జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోంది. గత ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో తెలియదు కానీ.. ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం బడ్జెట్‌లో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలకు ప్రాధాన్యం ఇచ్చి, ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలి.

– అరవింద్‌రెడ్డి, రైతు, చాకల్‌పల్లి, గోపాల్‌పేట మండలం

కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల దుమారం!

- తెరపైకి సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు
- మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో తిరుపతిరెడ్డి బ్యానర్లు
- చర్చనీయాంశంగా మారిన పరిణామాలు



మహబూబ్‌నగర్ అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



ఫ్లెక్సీ తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కాంగ్రెస్‌లో దుమారం రేపుతున్నాయి. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహబూబ్‌నగర్ స్థానం నుంచి ఆయన బరిలో నిలువనున్నారా? అనేది రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిగా మారింది. ఈ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీ చంద్‌రెడ్డి ఇది వరకే సన్నాహాలు మొదలుపెట్టారు. ఇదే సమయంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన మన్నె జీవన్‌రెడ్డి పేరు సైతం తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారాలను పర్యవేక్షించే ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి మిత్రమండలి పేరిట కొడంగల్, నారాయణపేట, మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాత్రికి రాత్రే తెల్లారేసరికి భారీస్థాయిలో బ్యానర్లు ఏర్పాటు చేయడంపై జోరుగా చర్చ సాగుతోంది.

సాయంత్రానికి తొలగింపు..

వంశీచందర్‌రెడ్డి ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించారు. పాలమూరు న్యాయయాత్ర పేరుతో పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతిరెడ్డి ఫ్లెక్సీలు వెలియడాన్ని బట్టి తానుసైతం ఎంపీ బరిలో ఉన్నానని చెప్పకనే చెప్పినట్లు పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో లేకుండా ఫ్లెక్సీలు వెలియడం, సాయంత్రం తర్వాత తొలగించడంతో కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందనేది హాట్ టాపిక్‌గా మారింది. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే ఫ్లెక్సీలను తొలగించారనేది ప్రచారం జరుగుతుండగా...ఈ పరిణామాలు అధిష్టానాన్ని కలవరపెడుతున్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలోని షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లో తిరుపతిరెడ్డికి పట్టు ఉందని, పోటీ పడడంలో తప్పేముందని ఆయన అనుచరులు చెబుతున్నారు. కాగా.. ఓ సమావేశంలో ఈ విషయంపై వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా పోటీలో ఉండవచ్చని, మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ తరఫున తనతో పాటు సీతాదయాకర్‌రెడ్డి, సంజీవ్ ముదిరాజ్, ఎన్పీ వెంకటేశ్ దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. తిరుపతిరెడ్డి అయినా.. ఇంకెవరికైనా అధిష్టానం టికెట్ ఇస్తే వారి గెలుపు కోసం కృషి చేస్తానని, మాకు చేతి గుర్తే ముఖ్యం.. వ్యక్తులు కాదని వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాల తర్వాత ఎవరిని టికెట్ వరిస్తుందోననే ఉత్కంఠ రేపుతుంది.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

- కలెక్టర్ జి.రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా మండలాల్లో తహసీల్దార్లు స్వాధీనం చేసుకున్న ఇసుకను ప్రభుత్వ పనులకు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వ పనులకు ఇసుక అవసరాలను అంచనావేసి, ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి ఎలాంటి పనులు పెండింగ్‌లో ఉంచవద్దని తహసీల్దార్లకు సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ చేయాలని తెలిపారు. వివిధ రకాల సర్టిఫికెట్లు సైతం జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు జారీ చేయాలన్నారు. ఈ–ఆఫీస్ ఫైళ్లను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సూచించారు. ఎల్పీజీ కనెక్షన్ నంబర్, ఏజెన్సీ పేర్లను అనుసంధానించే ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లకు తహసీల్దార్లు తాళాలువేసి ఉంచుకోవాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, గృహనిర్మాణ శాఖ ఈఈ వైద్యం భాస్కర్, మైనింగ్ ఏడీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధం

- మరోసారి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ
- మెజారిటీ సభ్యులు తీసుకోని వైనం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై ఈపాటికే అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఇక కొత్తవారిని ఎన్నుకునేందుకు రంగం సిద్ధమైంది. ఈనెల 12వ తేదీ ఉదయం 11గంటలకు ప్రత్యేక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన విషయం విదితమే. ప్రస్తుతం మహబూబ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ లో 49మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యేతో కలుపుకొని మొత్తం 50 ఓట్లు ఉన్నాయి. దీంతో కౌన్సిల్ సమావేశానికి 26 మంది హాజరై ఏ అభ్యర్థిని బలపరిస్తే వారికే చైర్మన్, వైస్ చైర్మన్ పీఠం దక్కుతుంది. కాగా, బీఆర్‌ఎస్ నుంచి అప్పట్లో ఎన్నికైన 30 మందికి మరోసారి అధిష్టానం విప్ జారీ చేసింది. తమ చైర్మన్ అభ్యర్థిగా ఐదోవార్డు కౌన్సిలర్ కె.వనజ, వైస్ చైర్మన్‌గా 20వ వార్డు కౌన్సిలర్ రావుల అనంతరెడ్డికి ఓటు వేయాలన్నారు. ఒకవేళ వేరే వర్గానికి వేస్తే అనర్హత వేటుకు గురికావాల్సి వస్తుందని అందులో పేర్కొన్నారు. అయితే వీరిలో మెజారిటీ సభ్యులు విప్‌ను తీసుకోకపోవడం గమనార్హం.

ఈసారి రెండు వర్గాల వారు హాజరు!

గత నెల 27న అవిశ్వాస తీర్మానానికి చేతులెత్తిన వారిలో బీఆర్‌ఎస్ 22 మంది, కాంగ్రెస్ నుంచి ఆరుగురు, ఎంఐఎం నుంచి నలుగురు, బీజేపీ నుంచి ముగ్గురు ఉన్నారు. మిగిలిన 14 మంది కౌన్సిలర్లు ఆ రోజు గైర్హాజరైన విషయం విదితమే. అయితే ఈ సారి వీరూ 12న జరిగే సమావేశానికి హాజరుకానున్నట్లు సమాచారం.

ఇదిలాఉండగా మెజారిటీ సభ్యులు చైర్మన్‌గా 21వ వార్డు కౌన్సిలర్ ఆనంద్‌గౌడ్‌ను ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ వర్గం నుంచి వైస్ చైర్మన్‌గా ఎవరినీ ఎంపిక చేయకపోయినా.. 29వ వార్డు కౌన్సిల్ మొయిన్‌అలీ (ఇండిపెండెంట్) లేదా 32వ వార్డు కౌన్సిలర్ సాదతుల్లా (ఎంఐఎం)లో ఎవరో ఒకరు కావచ్చని తెలుస్తోంది. మరోవైపు పార్టీ మారిన నలుగురు కౌన్సిలర్లపై అనర్హత వేటు వేయాలని గతంలోనే కేసీ నర్సింహులు వర్గం హైకోర్టులో వేసిన పిటిషన్ తాజాగా మరోసారి వాయిదా పడింది.

24 నుంచి టీసీసీ కోర్సు పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24నుంచి 27వ తేదీ వరకు డ్రాయింగ్ లోయర్, హయ్యర్, 25న టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, 26న టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్ వారికి పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. నిర్ణీత సమయాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు.

పరిపాలన అనుమతులు

'పేట – కొడంగల్' ఎత్తిపోతలకు రూ.2,945 కోట్లు

- సర్వే, డిజైన్, సమగ్ర అధ్యయనం చేయాల్సిందిగా ఆదేశం
- మూడు నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం
- భూత్పూర్ భీమా నుంచి కాల్వలు, చెరువులకు నీటి సరఫరా
- జీఓ 69 కొనసాగిస్తూ జీఓ 14 విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం



భీమా ప్రాజెక్టు లిఫ్ట్ (ఫైల్)



సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి

నారాయణపేట: మూడు నియోజకవర్గాల్లోని వేలాది మంది రైతుల కల అయిన నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇంజినీర్ ఇన్ చీఫ్ నుంచి ఫిబ్రవరి 1న పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా రూ.2,945.50 కోట్లు పరిపాలనపరమైన అనుమతులు ఇస్తూ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ ఉత్తర్వులు జారీ చేశారు. మూడు నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు అవసరమైన సర్వే, డిజైన్, సమగ్ర అధ్యాయనం, ఎగ్జిక్యూషన్ చేయాల్సిందిగా అధికారులను, ఇంజినీర్లను ఆదేశించారు. మహబూబ్‌నగర్ చీఫ్ ఇంజినీర్‌కు ఈ ప్రాజెక్టు బాధ్యతలను అప్పజెప్పిన ఇరిగేషన్ సెక్రటరీ, అవసరమైన అన్ని అనుమతులను డిపార్టుమెంటు నుంచి పొందాలని నిర్దిష్టమైన మార్గదర్శకాలను పాటించాలని స్పష్టం చేశారు. మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాగుభూములకు నీరు అందేలా డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఫీల్డ్ చానెల్స్‌పై చీఫ్ ఇంజినీర్ దృష్టి పెట్టాలని సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం పొందే ప్రతిపాదిత ఆయకట్టు ఇతర ప్రాజెక్టులతో ఓవర్ లాపింగ్ కాకుండా చూసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యేగా 69 జీఓ.. సీఎంగా 14 జీఓ

కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలకు సాగు, తాగునీటిని అందించేందుకు కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకం చేపట్టడానికి ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిచే ఉత్తర్వులు జారీ చేయించడంతో అప్పటి కొడంగల్ టీడీపీ ఎమ్మెల్యేగా రేవంత్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. జీఓ 69ను మార్చి 23, 2014న తీసుకువచ్చి సర్వే పనులు పూర్తి చేయించారు. ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలమూరు–రంగారెడ్డిని తెరపైకి తెచ్చి ఈ ఎత్తిపోతల పథకాన్ని మూలనపడేసింది. ఇన్నాళ్లకు సీఎంగా జీఓ 14ను విడుదల చేస్తూ రూ.2,945 కోట్లు నిధులు మంజూరు చేశారంటూ ఈ ప్రాంత ప్రజలు, రైతులు చర్చించుకుంటున్నారు.

2014లో జీఓ 69 విడుదల

నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి 2014 మే 23న జీఓ నం.69 విడుదల చేస్తూ రూ.1450 కోట్లు (ఏఐబీపీ పథకం కింద 90 శాతం నిధులు) మంజూరు చేసింది. ఆ నిధుల్లో రూ.133.86 కోట్లు ఆర్థికశాఖ అనుమతులు ఇస్తూ 7.10 టీఎంసీలు నీటిని కేటాయింపు చేశారు. దాంతో మక్తల్, ఊట్కూర్, నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద, మద్దూర్, దౌల్తాబాద్, కోస్గి, కొడంగల్, బొంరాస్‌పేట మండలాల్లో సాగునీరు అందేలా రూపొందించారు. నాలుగు దశల్లో నీటిని ఎత్తిపోసేందుకు ప్రణాళిక రూపొందించారు. మక్తల్ మండలం భూత్పూర్ నుంచి ఊట్కూర్ పెద్ద చెరువుకు, అక్కడి నుంచి నారాయణపేట మండలం జాజాపూర్‌కు చెరువుకు, ఆ తర్వాత జాయమ్మ చెరువుకు దామరగిద్ద మండలం కానుకుర్తి చెరువులోకి ఎనిమిది పంపుల ద్వారా నీటిని ఎత్తి పోసేందుకు 2012లో సర్వే పూర్తి చేశారు. ఆ తర్వాత దానిని పట్టించుకోకుండా వదిలేశారు.

తాతయ్య కల సాకారం

ఎమ్మెల్యేగా అభ్యర్థిత్వం ఖరారైన నాటి నుంచే నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం సాధనే ప్రథమ ప్రాధాన్యతగా ఎంచుకున్నా. తాతయ్య చిట్టెం నర్సిరెడ్డి కలల ప్రాజెక్టు సంగంబండ ఎత్తిపోతల పథకానికి కొనసాగింపుగా జాయమ్మ చెరువుకు నీళ్లు అందించడమే లక్ష్యంగా భావిస్తున్నా. మొదటిసారిగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశా. శరవేగంతో ఈ పథకానికి రూ.2,945 కోట్లు కేటాయించడం హర్షణీయం.

– చిట్టెం పర్ణికారెడ్డి, ఎమ్మెల్యే, నారాయణపేట

సీఎంకు కృతజ్ఞతలు

ఎన్నికల వేళ జీఓ 69ను సాధిస్తామని మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూర్ మండల రైతాంగానికి మాటిచ్చాం. అధికారంలోకి వచ్చిన రెండు నెలల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టును కొనసాగిస్తూ జీఓ 14, నిధులు విడుదల చేయడం హర్షణీయం. నియోజకవర్గ ప్రజలు, రైతుల తరఫున సీఎంకు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


లక్ష్మి(ఫైల్)

కోస్గి: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి కుటుంబ కలహాలతో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలం లోని మీర్జాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మీర్జాపూర్‌కు చెందిన గొల్ల లక్ష్మి(23) అదే గ్రామానికి చెందిన శ్రీనును ప్రేమించి మూడేళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. ఈ క్రమంలో కుటుంబంలో వచ్చిన కలహాలతో మనస్థాపానికి గురైన లక్ష్మి గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు పాలమూర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆమె తండ్రి గొల్ల నాగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవాబుపేట: కుటుంబ తగాదాలతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దొడ్డిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి కథనం ప్రకారం.. దొడ్డిపల్లికి చెందిన దరిపల్లి చెంద్రయ్య(45) 8వ తేదీ గురువారం మేకలను మేతకు తీసుకెళ్లి అక్కడే పరుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మధ్యాహ్నం అతని కుమారుడు తండ్రి దగ్గరకు వెళ్లి చూడగా వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలో కనిపించాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు చెప్పడంతో అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. అతని భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

వెల్దండ: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెల్దండ మండలంలోని తిమ్మినోనిపల్లికి చెందిన కోట్ల రాములు(70) ఈనెల 6న తీవ్ర మనస్థాపనికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. రాములుకు భార్య లక్ష్మమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బస్‌షెల్టర్‌లో వ్యక్తి..

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో పశువుల సంత సమీపంలో ఉన్న బస్ షెల్టర్‌లో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రుషికేష్ చెప్పిన వివరాల ప్రకారం.. నాగులపల్లికి చెందిన నరసింహ(65) నాలుగు రోజుల క్రితం సింగోటంకి వచ్చాడు. అతడు బస్ షెల్టరులోనే ఉంటూ అక్కడే రాత్రి సమయంలో బస చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామస్తులు చూడాగా అతడు చనిపోయి ఉన్నాడు. వెంటనే గ్రామస్తులు నాగులపల్లికి సమాచారం ఇచ్చారు. అతని కుమారుడు లాలు అక్కడికి చేరుకున్నాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి, తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బావిలోపడి యాచకుడు..

మహబూబ్‌నగర్ క్రైం: అనుమానాస్పదస్థితిలో ఇద్దరూ వ్యక్తులు పాడుబడిన బావిలో పడగా ఒకరు మృతి చెందగా, మరొకరు సురక్షితంగా బయటకు వచ్చాడు. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మండలంలోని కోడూర్ చెందిన సుండు వెంకటయ్య(55) ప్రతి రోజు మహబూబ్‌నగర్‌కు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు బిక్షాటన చేసి రాత్రికి గ్రామానికి వెళ్తాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్‌లో కోడూర్‌కు చెందిన రాజు ఆటో ఎక్కాడు. ఆ తర్వాత ఆటోలో కోడూర్ వరకు వెళ్లగా.. గ్రామానికి సమీపంలో ఉన్న పాడుపడిన బావిలో ఇద్దరూ అనుమానాస్పదస్థితిలో పడ్డారు. దీంతో సుండు వెంకటయ్య మృతి చెందగా రాజు మాత్రం బయటకు వచ్చాడు. ఆ సమయంలో రాజు మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. ఇద్దరి మధ్యలో ఘర్షణ జరిగిందా? లేదా సుండు వెంకటయ్యపై దాడి జరిగిందా? అనే విషయం తెలియాల్సి ఉంది. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ పరిశీలించి, బావిలో నుంచి మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

అర్ధరాత్రి వేళ..

తహసీల్దార్ కార్యాలయంలో

- జూనియర్ అసిస్టెంట్, మాజీ సర్పంచ్ కలిసి భూ పత్రాలు తారుమారు చేసే యత్నం?
- ఇద్దరిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన కాంగ్రెస్ నాయకులు
- విచారణకు ఆదేశించిన తహసీల్దార్
- మాజీ సర్పంచ్‌పై ఠాణాలో ఫిర్యాదు


తహసీల్దార్ కార్యాలయంలో అర్ధరాత్రి వేళ మాజీ సర్పంచ్, జూనియర్ అసిస్టెంట్

అచ్చంపేట రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కిందిస్థాయి సిబ్బందిదే పెత్తనం. కింది స్థాయి ఉద్యోగి చెప్పిందే వేదంగా నడుస్తోంది. వచ్చిన అధికారులు కూడా కిందిస్థాయి సిబ్బంది పైనే ఆధారపడి పనిచేస్తున్నారు. ఏళ్లుగా కార్యాలయంలో పాతుకుపోయిన సిబ్బంది అక్రమాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. తాజాగా గురువారం అర్ధరాత్రి తహసీల్దార్ కార్యాలయంలో భూ వివరాలు తారుమారు చేసేందుకు జూనియర్ అసిస్టెంట్, ఓ తాజా మాజీ సర్పంచ్ యత్నిస్తున్నారనే సమాచారం అందడంతో కాంగ్రెస్ నాయకులు కార్యాలయానికి చేరుకొని వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కాంగ్రెస్ నాయకుల కథనం మేరకు.. మండలంలోని బొమ్మన్‌పల్లి తాజా మాజీ సర్పంచ్ బోడ్యానాయక్ గురువారం అర్ధరాత్రి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లారు. అదే సమయంలో అక్కడే ఉన్న జూనియర్ అసిస్టెంట్ హన్మంత్‌నాయక్‌తో కలిసి కంప్యూటర్ గదిలో బొమ్మన్‌పల్లితో పాటు ఇతర రెవెన్యూ రికార్డులు తస్కరించడంతో పాటు వివరాలు తారుమారు చేసేందుకు యత్నిస్తుండగా సమాచారం అందుకున్న కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకొని వారి సంభాషణ, ఇతర వివరాలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేశారు. అనంతరం లోనికివెళ్లి అర్ధరాత్రి ఏం చేస్తున్నారని నిలదీయగా కల్యాణలక్ష్మి చెక్కులు, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు వివరాలు చూస్తున్నామని పొంతన లేని సమాధానం చెప్పారు. ఓ ప్రైవేటు వ్యక్తిని పక్కన కూర్చో బెట్టుకొని ఈ సమయంలో కంప్యూటర్ గదిలో కంప్యూటర్లు ఆన్‌చేసి ఏం చేస్తున్నారని జూనియర్ అసిస్టెంట్‌ను అడగగా సమాధానం దాటవేశాడు. దీంతో వెంటనే సీఐ రవీందర్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని ఉద్యోగితో పాటు మాజీ సర్పంచ్ దగ్గరున్న పత్రాలు తీసుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్ధరాత్రి వేళ కార్యాలయంలో ఎందుకున్నారని ప్రశ్నించారు. కార్యాలయం నుంచి అందరినీ బయటకు పంపించారు.

విచారణ చేపట్టాలి..

బొమ్మన్‌పల్లి తాజా మాజీ సర్పంచ్ అర్ధరాత్రి వేళ తహసీల్దార్ కార్యాలయంలోకి వచ్చి దర్జాగా విలువైన భూ పత్రాలు తస్కరించడంతో పాటు ఆన్‌లైన్‌లో వివరాలను తారుమారు చేసేందుకు యత్నించారని శుక్రవారం ఉదయం కార్యాలయంలో తహసీల్దార్ పాండుతో కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. అర్ధరాత్రి సమయంలో ప్రైవేటు వ్యక్తి కార్యాలయంలోకి ఎందుకు వచ్చారని.. ఆ సమయంలో కార్యాలయం ఎందుకు తెరిచారో విచారణ చేపట్టి జూనియర్ అసిస్టెంట్, మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బొమ్మన్‌పల్లి, శివారు ప్రాంత భూములపై విచారణ చేపట్టాలని పట్టుబట్టారు. ప్రైవేట్ వ్యక్తులకు కార్యాలయం తాళం చెవులు ఇవ్వడం సరైంది కాదన్నారు.

సర్పంచ్ కారులో భూ దస్త్రాలు?

ఇదిలా ఉండగా కార్యాలయ ఆవరణలో నిలిపిన మాజీ సర్పంచ్ బోడ్యానాయక్ కారును పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కారులో భూములకు సంబంధించిన కాగితాలు, దస్త్రాలు ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. జూనియర్ అసిస్టెంట్ కార్యాలయంలో చాలా ఏళ్లుగా పనిచేస్తుండటంతో అతడికి మండలంలోని భూ వివరాలు తెలుసని, బినామీల పేరు మీద ఎకరాల్లో భూములు బదలాయించారని సమాచారం. దొంగ పట్టాదారు పాసు పుస్తకాలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం..

జూనియర్ అసిస్టెంట్ హన్మంత్‌నాయక్‌కు గురువారం ఎలాంటి పనులు అప్పగించలేదు. అర్ధరాత్రి వరకు కార్యాలయంలో ఉన్నట్లు ఎవరికీ సమాచారం ఇవ్వలేదు. కార్యాలయంలో వారు ఉన్నట్లు విషయమే తెలియదు. కార్యాలయంలోకి వచ్చిన మాజీ సర్పంచ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. బొమ్మన్‌పల్లికి సంబంధించిన భూ వివరాలపై నివేదికలు అందించాలని ఆదేశాలు జారీ చేస్తాం.

– పాండు, తహసీల్దార్, అచ్చంపేట


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దాడులు ముమ్మరం


శుక్రవారం ఊకచెట్టువాగులో ఇసుక తోడుతున్న పొక్లెయిన్‌ను గుర్తించిన అధికారులు

ఇసుక అక్రమ రవాణాపై అధికారుల ఉక్కుపాదం

- రెండ్రోజుల్లో సుమారు 4 వేల ట్రిప్పుల డంప్‌ల గుర్తింపు
- ఊకచెట్టువాగు, కృష్ణానది తీరప్రాంతాల్లో తనిఖీలు

వనపర్తి: కొత్త ఇసుక పాలసీ అమలులోకి తీసుకురావాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో ఇసుక అక్రమ నిల్వలు, రవాణాపై అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. పెబ్బేరు మండలంలోని కృష్ణానది తీరప్రాంతాలు, ఊకచెట్టువాగు పరిసరాల్లో రెండ్రోజులుగా విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు పొక్లెయిన్లతో ఇసుక తవ్వకాలు, ఇసుక అక్రమ నిల్వల సమాచారాన్ని అధికారులకు చేరవేస్తుండటం గమనార్హం. ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న ఆయా శాఖల అధికారులకు 48 గంటల డెడ్‌లైన్ విధిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలో ఇన్నాళ్లు చూసీ చూడనట్లుగా ఉండే అధికారులు ఇసుక అక్రమ రవాణా, నిల్వలను గుర్తించేందుకు ఉరుకులు, పరుగులు పెడుతుండటం గమనార్హం.


ఊకచెట్టువాగు వద్ద గురువారం సీజ్‌చేసిన ఇసుక డంపులు

రెండ్రోజుల్లో నాలుగు వేల ట్రిప్పులు..

అధికారులు దాడులు నిర్వహించిన రెండురోజుల్లో ఏకంగా నాలుగు వేల ట్రిప్పుల ఇసుకను గుర్తించడంతో పాటు ఊకచెట్టువాగులో ఇసుక తోడుతున్న పొక్లెయిన్‌ను గ్రామస్తుల సాయంతో పట్టుకున్నారు.

కనిపించని ట్రాక్టర్లు..

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగే పెబ్బేరు మండలంలోని కృష్ణానది తీర ప్రాంతాల్లో విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ బృందాలు రెండ్రోజులుగా తనిఖీలు నిర్వహిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో తిరిగే ట్రాక్టర్ల జాడ కనిపించటం లేదు. పెబ్బేరు నుంచి రాంపురం మీదుగా కృష్ణానది వరకు వెళ్లే రహదారిని ఒక్కసారి పరిశీలిస్తే ఏ స్థాయిలో ట్రాక్టర్లు తిరిగేవో తెలుస్తుంది.

రాంపురం కేంద్రంగా..?

కొన్నాళ్లుగా పెబ్బేరు మండలం రాంపురం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుందన్న విషయం బహిరంగ రహస్యమే. అయినా.. ఫిర్యాదులొస్తేగాని స్పందించని అధికారుల తీరును ఆసరా చేసుకున్న అక్రమార్కులు యథేచ్ఛగా కృష్ణానది, ఊకచెట్టువాగు నుంచి తోడిన ఇసుకను ఇతర జిల్లాలకు సైతం తరలించి సొమ్ము చేసుకున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను పెద్దమొత్తంలో గద్వాల జిల్లాకు తరలించినట్లు ప్రచారంలో ఉంది. మండలంలోని రాంపురం, రామమ్మపేట, శాఖాపూర్, రంగాపూర్‌లోనూ ఇసుక దందా జోరుగా సాగుతోంది.

పెద్దపులి దాడిలో ఎద్దు మృతి

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో కాడిఎద్దుపై పెద్దపులి దాడి చేసి చంపిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. నల్లమల అటవి లోతట్టు ప్రాంతం మల్లాపూర్ చెంచు పెంటలో నివాసం ఉంటున్న చిగుర్ల బయ్యన్న పశువులు రోజు మాదిరిగానే పెంట సమీపంలోని అడవిలోకి మేత కోసం వెళ్లాయి. ఈ క్రమంలో రేగడి కాల్వ సమీపంలో పశువుల గుంపుతో కలిసి గడ్డి తింటున్న ఎర్ర చుక్కల ఎద్దుపై పెద్ద పులిదాడి చేసి చంపేసింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ. 50 వేలు ఉంటుంది. సంఘటనా స్థలాన్ని అటవీ శాఖ అధికారులు శిల్పా, తదితరులు పరిశీలించి పంచనామా చేశారు.

మహిళ అదృశ్యం

రాజోళి: ఇంటి దగ్గర ఉన్న మహిళ అదృశ్యమైన ఘటన శుక్రవారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని కుర్వ కర్ణ భార్యకు షుగర్, బీపీ ఉంది. ఈ నెల 3వ తేదీన ఆమెకు ట్యాబెట్లు తీసుకొచ్చేందుకు భర్త బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చేలోపు ఆమె ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కలా, బంధువులతో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు.

చెరువులో మొసలి సంచారం



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాల గ్రామ శివారులోని రాజ చెరువులో శుక్రవారం ఉదయం మొసలి సంచరించడం చూసి గ్రామస్తులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులు, గొర్రెలు నీళ్ల తాగడానికి చెరువులోకి వెళ్తాయని కాపరులు, రైతులు పేర్కొన్నారు. ఫారెస్టు అధికారులు స్పదించి మొసలిని పట్టుకొని నదిలో వదిలేయాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలితో అసభ్య ప్రవర్తన


ఆందోళన నిర్వహిస్తున్న మహిళా వర్కర్లు

- సూపర్‌వైజర్‌కు దేహశుద్ధి చేసిన సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: పారిశుధ్య కార్మికురాలితో అసభ్యంగా ప్రవర్తించిన సూపర్‌వైజర్‌కు దేహశుద్ధి చేసిన ఘటన జిల్లా కేంద్రంలోని మెడికల్‌కళాశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న మహిళను సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పాలెం గ్రామానికి చెందిన మహేష్ గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీసాయి ఏజెన్సీ ఆఫీస్‌లో శుభ్రం చేసేందుకు రమ్మని పిలిపించుకున్నాడు. ఈ క్రమంలో మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె తప్పించుకుని ఇంటికి వెళ్లిపోయింది. శుక్రవారం ఉదయం ఆమె కుటుంబసభ్యులు, తోటి మహిళా వర్కర్లతో కలిసి మెడికల్ కళాశాలకు వద్దకు వెళ్లి ఆందోళన నిర్వహించడంతో పాటు సూపర్‌వైజర్ మహేష్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోల్కంపల్లిలో ఇసుక తరలింపు అడ్డగింత


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మంగౌడ్

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లిలో పాలమూరు శాండ్ ట్రాక్టర్లను గ్రామానికి చెందిన రైతులు, నాయకులు శుక్రవారం అడ్డుకున్నారు. కొన్నాళ్ల క్రితం పోల్కంపల్లి శివారులోని పెద్దవాగులో ప్రభుత్వం అధికారికంగా ఇసుక క్వారీని ఏర్పాటు చేసి పాలమూరు శాండ్‌ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న వారికి సరఫరా చేస్తోంది. వాగులో ఇసుక తవ్వకాలు చేపట్టడం ద్వారా తమ బోరుబావులు ఎండిపోతున్నాయని గత నెల 24న గ్రామానికి చెందిన రైతులు అడిషనల్ కలెక్టర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. తాజాగా పాలమూరు శాండ్ ద్వారా ఇసుక రవాణా మొదలు కావడంతో మళ్లీ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వాగులో ఇసుక నింపి వెళ్తున్న ట్రాక్టర్లను బ్రిడ్జి వద్ద అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇసుక తరలింపు ఇలాగే కొనసాగితే తమ పంటలు ఎండిపోయి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, గిర్దావర్ రవి, పోలీసులు అక్కడికి వెళ్లి గ్రామస్తులను సముదాయించారు. జిల్లా అవసరాల కోసం ఇసుక తరలిస్తున్నందున అడ్డుకోవద్దని గ్రామస్తులకు సూచించారు. రైతులు తమ సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించాలని చెప్పారు. తర్వాత ఇసుకతో వచ్చిన ట్రాక్టర్లను అధికారులు పంపించారు. కాగా పెద్దవాగులో ఇసుక తరలింపును నిలిపేసి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, నర్సింహులు, మధు, బాలమాసయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, రైతులు తదితరులు ఉన్నారు.

మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగార్జునగౌడ్

బాలానగర్: దుండుభి వాగులో మూడురోజుల క్రితం లభించిన మహిళ మృతదేహం కేసును ఛేదించినట్లు రూరల్ సీఐ నాగార్జునగౌడ్ తెలిపారు. శుక్రవారం జడ్చర్లలోని తన కార్యాలయంలో నిందితుడిని చూపించి పూర్తి వివరాలు వెల్లడించారు. రాజాపూర్ మండలం రాఘవాపూర్‌కు చెందిన మీసాల రాజుతో నందారం గ్రామానికి చెందిన స్వప్నకు 14 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉండగా.. కొన్నేళ్ల కిందట రాజు మృతిచెందాడు. దీంతో ఇద్దరు కుమార్తెలతో స్వప్న అక్కడే ఉంటూ జీవనం సాగించేది. కాగా ఏడాది కిందట స్వప్నకు గుండేడ్ గ్రామానికి చెందిన శ్రీశైలంతో పరిచయం ఏర్పడింది. రాఘవాపూర్‌లోని తన చెల్లి దగ్గరకు వెళ్లి వచ్చే క్రమంలో స్వప్నతో ఏర్పడిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇద్దరూ కొంతకాలంగా కలిసే ఉండేవారు. పిల్లలు పెరుగుతున్నారు.. కలిసి ఉండటం కుదరదని మూడునెలల కిందటి నుంచి స్వప్న చెబుతుండగా అది తట్టుకోలేని శ్రీశైలం చీరను స్వప్న గొంతుకు చుట్టి చంపేసి రెండు కాళ్లు కట్టి పక్కనే ఉన్న దుండుభి వాగులో పడేశాడు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న శ్రీశైలం శుక్రవారం ఉదయం బాలానగర్ బస్‌స్టాప్ వద్ద ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో సిబ్బంది అక్కడికి చేరుకొని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. సమావేశంలో ఎస్‌ఐ తిరుప్పాజీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ఏస్‌ఐ శ్రీనివాసరావు, హెచ్‌సీ దౌలత్, వెంకటయ్య, రవి, యాదగిరి, వెంకట్‌రెడ్డి సహకరించినట్లు పేర్కొన్నారు.

విద్యకు పేదరికం అడ్డుకాకూడదు


విద్యార్థినులతో ట్రస్టు సభ్యులు, ప్రజాప్రతినిధులు

కల్వకుర్తి టౌన్: చదువుకునే ప్రతి విద్యార్థికి పేదరికం అడ్డుకాకూడదని జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మలబార్ గోల్డ్ ట్రస్టు ఆధ్వర్యంలో కవి, గాయకుడు జయరాజ్‌తో కలిసి విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి, విద్యార్థులకు తోడ్పాటు అందిస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం కవి, గాయకుడు జయరాజ్ మాట్లాడుతూ చదువుతోనే గొప్ప లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని.. వారందరూ చదువులో రాణించేలా సంస్థ ద్వారా తోడ్పాటు అందిస్తున్నట్లు మలబార్ గోల్డ్ ట్రస్టు చైర్మన్ జీశాన్ తెలిపారు. కళాశాలలో చదువుతున్న 224 మంది విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలతో పాటు రూ.18 లక్షల నగదును అందజేశారు. అనంతరం మలబార్ గోల్డ్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులను కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, ప్రిన్సిపాల్స్ సంజీవరెడ్డి, శ్రీనివాస్, మలబార్ గోల్డ్ ట్రస్టు ప్రతినిధులు అజిత్, అఖిల్, కేవీ సుధాకర్, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.



మద్యం మత్తులో కారు డ్రైవర్ బీభత్సం

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు
- మరొకరి పరిస్థితి విషమం


నర్సింహ(ఫైల్)


ప్రమాదానికి కారణమైన సతీష్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి కారు నడిపి బీభత్సతం సృష్టించాడు. దీంతో ముగ్గురికి గాయాలు కాగా, ఒకరు మృతి చెందారు. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట పోలీస్‌స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయిణిపేటకు చెందిన సతీష్‌రెడ్డి కొత్తకోట నుంచి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా కొత్తకోట చౌరస్తాలో రోడ్డు పక్కన ఉన్న ఓ వ్యక్తి ఢీకొనగా అతనికి గాయాలు అయ్యాయి. వెంటనే బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని ఢీకొనడంతో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. గాయపడిన వారిని స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. స్థానికులు కారును వెంబడించడంతో అతివేగంగా వెళ్తూ పోలీస్ స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొనడంతో రామకృష్ణాపురం చెందిన నర్సింహ(38) అక్కడికక్కడే మృతి చెందాడు. అప్రమత్తమైన ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కారులో ఇరుక్కున్న సతీష్‌రెడ్డిని బయటకు తీసి స్టేషన్‌కు తరలించారు. బైక్‌పై ఉన్న వ్యక్తి రెండు కాళ్లు విరిగిపోయి ఎగిరిపడి ముళ్లపొదలో చనిపోయి కనిపించాడు. మృత దేహాన్ని బయటకు తీసి వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

ఇంజినీరింగ్ వర్క్‌షాప్‌లో చోరీ


దొంగలు పడ్డ సంజీవరాయ ఇంజినీరింగ్ షాప్

ధరూరు: మండల కేంద్రంలో వరుస దొంగతనాలతో వ్యాపారులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు బస్టాండ్ పక్కనున్న సంజీవరాయ ఇంజినీరింగ్ షాప్‌లో దొంగతనానికి పాల్పడ్డారు. రేకుల షెడ్డులో కొనసాగుతున్న ఇంజినీరింగ్ షాప్ పైకప్పు రేకుల స్క్రూలు తీసి లోపలికి చొరబడి అందులోని విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. సమర్సిబుల్ కేబుల్ వైర్, బుష్‌లతో పాటు కాపర్ వైర్‌ను చోరీ చేశారు. పోయిన వస్తువుల విలువ రూ.2.5లక్షలు ఉంటుందని యజమాని సూర్యనారాయణ తెలిపారు. ఈ విషయమై రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పది రోజుల క్రితం నెట్టెంపాడు ప్రధాన కాల్వ వెంట ఉన్న రైతుల మోటార్ల కేబుల్ వైర్‌ను ఎత్తుకెళ్లిన విషయం విధితమే.

క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- పేట ఎస్పీ యోగేష్ గౌతమ్



నారాయణపేట రూరల్: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ఓఎంఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టైలరింగ్, బ్యూటీషియన్, ల్యాబ్ టెక్నీషియన్స్‌పై ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు, నిత్యావసర సరుకులు, ప్రశంసాపత్రాలను అందించారు. మహిళలకు అత్యవసర సమయంలో రక్షణకోసం షీ టీమ్స్ ఉంటాయనే విషయం తెలుసుండాలన్నారు. మహిళలు, బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తే వెంటనే 100, మహిళా హెల్ప్ లైన్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనవసరమైన లింకులు మొబైల్‌కు వస్తే ఓపెన్ చేయరాదని, లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 193కుగాని డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, నిర్వాహకులు ఏంజిలా, డెవిస్, అజమ్మ, నర్సింహా, ఆశమ్మ, కృష్ణ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలంగాణ ఎన్జీసీ ప్రాజెక్టు డైరెక్టర్ రాధిక అన్నారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని పిల్లలమర్రి వద్ద ఉన్న జిల్లా సైన్స్ మ్యూజియంలో సుస్థిర జీవన విధానంపై విద్యార్థుల పాత్ర అనే అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మానవాళి తప్పిదాలతో పాటు నిర్లక్ష్యం కారణంగా వాతావరణం సమతుల్యత దెబ్బతింటుందని, దాని వల్ల మనిషికి అనేక కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఎన్జీసీ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించి పాఠశాల స్థాయిలో గ్రీన్ అంబాసిడర్‌లు నియమించి గొప్ప పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఓ శ్రీనివాస్, రీసోర్సుపర్సన్లు వెంకటేశ్వర్లు, శృతి, ప్రతమ్ సంతోష్, గుముడాల చక్రవర్తి పాల్గొన్నారు.



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



విద్యుత్‌కాంతుల్లో జోగుళాంబ అమ్మవారి ఆలయం

- జోగుళాంబ ఆలయంలో ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు
- చివరి రోజు అమ్మవారికి సహస్రఘట్టాభిషేకం, నిజరూప దర్శనం
- తరలిరానున్న భక్తులు, ప్రముఖులు



జోగుళాంబ అమ్మవారు

అలంపూర్/జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తి పీఠాల్లోని ఐదవ శక్తిపీఠమైన జోగుళాంబ అమ్మవారి క్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. అమ్మవారి ఆలయంలో ఐదు రోజు పాటు ఈ బ్రహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ పురేందర్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు తెలిపారు. బ్రహోత్సవాలు ఈ శనివారం నుంచి 14వ తేదీ బుధవారం వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల చివరి రోజు సహస్రఘట్టాభిషేక పూజలు విశేషంగా నిర్వహిస్తారు. అదేవిధంగా భక్తులకు అమ్మవారి నిజరూప దర్శన భాగ్యం కలుగుతుంది. ఆరోజు అమ్మవారి దర్శణానికి భక్తులు, ప్రముఖులు విశేషంగా తరలిరానున్నారు.

పునఃప్రతిష్టతో వార్షిక బ్రహోత్సవాలు

అమ్మవారి పునఃప్రతిష్ట అనంతరం ప్రతి ఏడాది బ్రహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జోగుళాంబ అమ్మవారు ఆరు దశాబ్దాల పాటు బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో పూజలందుకున్నారు. నూతన ఆలయ నిర్మాణం అనంతరం 2005 ఫిబ్రవరి 13వ తేదీన వసంత పంచమి రోజు జోగుళాంబ మాతను పునఃప్రాణ ప్రతిష్ట చేశారు. అప్పటి నుంచి వార్షిక బ్రహోత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.

ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

బ్రహోత్సవాల మొదటి రోజు ఉదయం 8 గంటలకు అమ్మవారి ఆలయంలో యాగశాల ప్రవేశ పూజలు, పుణ్యాహవచనం, మహాగణపతి పూజ, రుత్విక్‌వరణం, మహాకలశ స్థాపన, సాయంత్రం 6 గంటలకు అంకురారోపణం, అనంతరం ధ్వజారోహణం నిర్వహిస్తారు. రెండో రోజు 11వ తేదీన విశేష అర్చనలు, చండీహోమం, పవమాన సూక్తి పారాయణం, పవమాన సూక్తి హోమాలు, ఆవాహిత దేవతా హోమములు, మండపారాధన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు చేపడుతారు. ఐదవ రోజు వసంత పంచమి 14వ తేదీన ఉదయం 9గంటలకు అమ్మవారి ఆలయంలోని యాగశాలలో నిత్యహోమములు, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సహస్ర ఘటములకు ఆవాహన అర్చన అనంతరం అమ్మవారికి(మూల విగ్రహానికి) అవబృదస్నపనం, పంచామృతాభిషేకం, భక్తులకు అమ్మవారికి నిజరూప దర్శణ భాగ్యం ఉంటుంది. సాయంత్రం 4 గంటలకు బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 6:30 గంటలకు ధ్వజారోహణంతో బ్రహోత్సవాలు ముగుస్తాయి.



జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు

గవర్నర్‌కు ఆహ్వానం

- తమిళిసైను కలిసిన అలంపూర్ ఆలయాల ఈఓ, సిబ్బంది
- 14న నిజరూప దర్శనానికి రావాలని విజ్ఞప్తి

అలంపూర్: జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహోత్సవాల ఆహ్వాన పత్రిక రాజ్‌భవన్‌కు చేరింది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గర్నర్ తమిళి సై సౌందర్య రాజన్‌ను అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థాన ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, ప్రధాన అర్చకుడు డిండిగల్ ఆనంద్ శర్మ శుక్రవారం కలిసినట్లు తెలిపారు. అమ్మవారి వార్షిక బ్రహోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అమ్మ, స్వామి వారి జ్ఞాపికను బహూకరించారు. బ్రహోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. 14న అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుందని గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు. అదేవిధంగా ఆలయంలో యాగశాలలో నిత్య హోమాలు, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సహస్రఘట్టాలకు ఆవాహన అర్చన అనంతరం జోగుళాంబ అమ్మవారికి అవబృదస్నపనం, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు ఉండనున్నట్లు వివరించినట్లు పేర్కొన్నారు.

పీవీకి భారతరత్నపై హర్షం



నవాబుపేట మండల కేంద్రం వ్యూ

- 52 ఏళ్ల క్రితం పీవీ చేతుల మీదుగా విద్యుత్ ప్రారంభం

నవాబుపేట: కారు చీకట్లో ఉన్న మండలాన్ని విద్యుత్ వెలుగులతో నింపిన పీవీ నర్సింహారావును మండల ప్రజలు ఎన్నటికి మరిచిపోరు. ఆయనను దేశ ప్రధానిగా ప్రకటించటంతో మండలం మొత్తం సంతోషించి సంబరాలు చేశారు. ఆయన మరణ వార్త విని తమ అభిమాన నేతను కోల్పోయామన్న భావనతో మనోవేదన చెందారు. తాజాగా ఆయనకు భారతరత్న ప్రకటించటంతో మండల ప్రజలు మరోసారి సంతోషం వ్యక్తం చేశారు. 1972 జులై 28వ తేదీన పీవీ నర్సింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో నవాబుపేట మండల కేంద్రంలో విద్యుత్ బల్బు వెలిగించి మండల కేంద్ర ప్రజలకు వెలుగులు ప్రసాదించారు. దీంతో మండల ప్రజలకు పీవీ మరుపురాని నేతగా మారారు. దీనికి కారణం అప్పటి నవాబుపేట సర్పంచ్ రంగారావుకు పీవీతో ఉన్న సాన్నిహిత్యంతోనే మారుమూల గ్రామానికి వచ్చి విద్యుత్ ప్రారంభించారు.

నాటి జ్ఞాపకాలు మధురం



చీకటైతే చాలు కందిళ్ల వెలుతురులో ఉండే ఊరికి తన హయంలో కరెంట్ తీసుకుని రావాలని ప్రయత్నించి పీవీకి సమావేశంలో హైదరాబాద్‌లో చెప్పాను. దీంతో ఆయన త్వరలోనే పని పూర్తి చేస్తానని చెప్పి ఏకంగా తానే స్వయంగా గ్రామానికి వస్తానని చెప్పటంతో సంబరపడిపోయాం. తీరా ఆయన కరెంట్ ప్రారంభానికి వచ్చిన రోజు పండుగ చేసుకున్నాం. తాజాగా అత్యున్నత పురస్కారం భారత రత్న లభించటం మరింత సంతోషం.

– రంగారావు, మాజీ సర్పంచ్, నవాబుపేట

నిలకడగా నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం నీటిమట్టం 1,019 అడుగుల మేర ఉంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌గా నిలవాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలవాలని కోచ్ సాధిక్‌అలీ అన్నారు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్‌లో శని, ఆదివారాల్లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాలుర జట్టు శుక్రవారం తరలివెళ్లింది. ఈ సందర్భంగా కోచ్ జిల్లా క్రీడాకారులను అభినందించారు. టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరచాలని కోరారు. జిల్లా క్రీడాకారులు సాఫ్ట్ బాల్‌లో జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు నాగరాజు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన కురుమూర్తి కొండలు



రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- మార్మోగిన గోవింద నామస్మరణం

చిన్నచింతకుంట: అమ్మపురం కురుమూర్తి స్వామి దర్శనానికి అమవాస్యను పురస్కరంచుకుని శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుప్రభాత సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉదయం నుంచే తరలివచ్చారు. కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు.

కోనేటి స్నానానికి నోచుకోని భక్తులు

కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే భక్తలు కోనేటి స్నానాలకు నోచుకోలేక పోతున్నారు. స్నానాలు ఆచరించి తడిగుడ్డలతో స్వామివారిని దర్శించుకుంటే సర్వ పాపాలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం . కోనేరులో స్వామి వారి బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే నీటిని ఉంచి మిగితా సమయంలో ఉంచడంలేదు. దీంతో ప్రతి నెల అమావాస్యను పురస్కరంచుకుని వేలాదిగా తరలివచ్చే భక్తులకు కోనేటి స్నానం లభించడంలేదు. దీంతో భక్తులు కోళాయిల వద్ద గంటల తరబడి వేచి స్నానాలు ఆచరిస్తున్నారు. అధికారులు ప్రతి నెల అమావాస్య రోజు కోనేరులో నీటిని ఉంచి స్నానాలు ఆచరించేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఆలయం వద్ద నీరు లేని కోనేరు

ప్రజాపాలనలో పాలమూరుకు మంచిరోజులు

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన పాలనలో ఉమ్మడి పాలమూరుకు మంచి రోజులు వచ్చాయని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి అనుమతిలిస్తూ జీఓ 14 జారీ చేసినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుతో మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. గత ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రీడిజైన్ పేరుతో రూ.35వేల కోట్లకు పెంచి ప్రజాధనాన్ని దోచుకుందని ఆరోపించారు. పాలమూరు ఎత్తిపోతల నిర్మాణం కోసం రూ.28,012 కోట్ల బిల్లులు డ్రా చేసి, 80 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈ ఎత్తిపోతలతో ఒక్క ఎకరాకు సాగు నీరందించిన పాపాన పోలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2009 నుంచి 2014 వరకు కృష్ణా బేసిన్ నుంచి తెలంగాణ వాటాలో 262 టీఎంసీల నీటిని తీసుకోగా.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో 212 టీఎంసీల నీటిని మాత్రమే సద్వినియోగం చేసుకోవడం జరిగిందన్నారు. కృష్ణా బేసిన్‌లో నీటి కేటాయింపులు పూర్తి స్థాయిలో రాష్ట్రానికి దక్కే వరకు కేఆర్ఎంబీకి రాష్ట్ర ప్రాజెక్టులను అప్పగించే సమస్యే లేదని తేల్చిచెప్పారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి అరవింద్‌కుమార్, పార్లమెంట్ నియోజకవర్గ అబ్జర్వర్ జహీర్ అక్బర్, లక్ష్మణ్‌యాదవ్, సీజే బెనహర్, వెంకటయ్య, జిల్లెల్ల చంద్రశేఖర్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మార్మోగిన శివనామస్మరణ



ఏర్పాటుచేసిన అగ్నిగుండం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా అగ్నిగుండ మహోత్సవం, శివపార్వతుల కల్యాణం

దేవరకద్ర: స్థానిక శివాలయం ఆవరణ శుక్రవారం తెల్లవారుజాము నుంచి శివనామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో గురుస్వామి నాగభూషణం వీరభద్రుడి విగ్రహంతో ముందు నడవగా వెనుక నుంచి శివస్వాములు నడిచారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు వందలాది మంది స్వాములు, భక్తులు తరలివచ్చారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా వీరభద్రసేవ, నందికోళ్ల సేవ నిర్వహించారు. శివభక్తులు పోచమ్మ ఆలయం నుంచి హారా వీరా.. హారా శరభా.. ఓం నమశ్శివాయ అంటూ ఖడ్గాలు చదువుతూ కొబ్బరికాయలను అరచేతిలో పగులగొట్టారు. నందికోళ్ల సేవలో స్వాముల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పీయూలో నిధులలేమి!

- కొన్నేళ్లుగా నిధుల కేటాయింపులో అన్యాయం
- ప్రతిపాదిత నిధుల్లో 20 శాతం కూడా మంజూరు చేయని వైనం
- సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులతో విద్యార్థులపై పెనుభారం
- తరగతి గదులు, రీసెర్చ్ ల్యాబ్‌లు లేక అవస్థలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఉమ్మడి జిల్లాకు ఉన్నత విద్య అందించే పీయూ.. నిధుల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయానికి గురవుతోంది. ప్రభుత్వం కేవలం యూనివర్సిటీ సిబ్బంది వేతనాలను మాత్రమే ఇస్తుండటంతో అభివృద్ధి కుంటుపడింది. రాష్ట్రంలోని మిగతా యూనివర్సిటీలతో పోలిస్తే.. అభివృద్ధిలో పీయూ వెనుకపడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్నేళ్లుగా పీయూలో చేపడుతున్న అభివృద్ధి పనులకు అంతర్గత నిధుల నుంచి కేటాయించడం కొసమెరుపు. ఆరేళ్ల కాలంలో రూ.651 కోట్ల ప్రతిపాదనలు పంపిస్తే.. రూ.60 కోట్లే కేటాయించడం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరంలో పీయూ అభివృద్ధి, సిబ్బంది వేతనాలతో కలిపి మొత్తం రూ.105 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కొత్త ప్రభుత్వమైనా పీయూ అభివృద్ధికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని విద్యార్థి సంఘాలతో పాటు పీయూ అధికారులు కోరుతున్నారు.

విద్యార్థులపైనే భారం..

యూనివర్సిటీతో పాటు కొల్లాపూర్, గద్వాల, వనపర్తి పీజీ సెంటర్‌లలో రెగ్యులర్ అధ్యాపకులు ఉన్న కోర్సులను సైతం ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చింది. కొన్ని చోట్ల రెగ్యులర్ అధ్యాపకులు తక్కువగా ఉండటంతో చాలా మంది కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వర్తిస్తున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల తరగతులు చెప్పే కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలను విద్యార్థులు చెల్లించే ఫీజుల నుంచి చెల్లిస్తున్నారు. దీంతో విద్యార్థులపై పెనుభారం పడుతోంది. రూ.వేలల్లో ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలను ప్రభుత్వం చెల్లిస్తే విద్యార్థులపై భారం తగ్గుతుంది. పీజీ సెంటర్‌లలో కళాశాల భవనాలు, హాస్టల్స్, అడ్మినిస్ట్రేషన్ భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. పీయూతో పాటు పీజీ సెంటర్‌లలో కూడా రీసెర్చ్ ల్యాబ్‌లు, ఇంక్యూబేటర్ సెంటర్ నిర్మిస్తే పరిశోధనలు మరింత పెరిగే అవకాశం ఉంది.

పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య..

పీయూలో ప్రతి సంవత్సరం కొత్త కోర్సులు రావడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇటీవల పీయూలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సు ప్రవేశపెట్టగా.. విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతి గదులను కేటాయించలేదు. అదేవిధంగా లా డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తరగతి గదుల కాంప్లెక్స్ నిర్మించాల్సిన అవసరం ఉంది. క్రీడామైదానం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ఆస్పత్రి ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం పీయూలో బాలికల హాస్టల్ ఉండగా.. విద్యార్థినుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కొత్త హాస్టల్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.10 కోట్ల వ్యయంతో ఒక అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్ గ్రౌండ్ నిర్మాణ దశలో ఉంది.

నిధుల కేటాయింపుల్లో అన్యాయం..



గతంలో పీయూకు నిధుల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగింది. పీయూ అభివృద్ధిపై ప్రభుత్వం వివక్ష చూపింది. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లావాసి కావడంతో పీయూకు న్యాయం చేస్తారని భావిస్తున్నాం. నిధులు అధికంగా కేటాయించాలని ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశాం. – రాము, పీయూ జేఏసీ చైర్మన్


విద్యార్థులపై భారం తగ్గించాలి..



సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చడంతో పాటు విద్యార్థులపై ఫీజుల భారం తగ్గించాలి. ఫీజులు ఎక్కువగా ఉండటం వల్ల కొన్ని కోర్సుల్లో అడ్మిషన్లు జరగడం లేదు. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, ఫీజురియంబర్స్‌మెంట్, ట్యూషన్ ఫీజులను వెంటనే విడుదల చేయాలి.

– పవన్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు, పీయూ

అధిక నిధులొస్తాయని భావిస్తున్నాం..



యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం రూ.105 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించాం. ఈమేరకు ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో నిధులు ఇస్తుందని భావిస్తున్నాం. నిధుల వస్తే పీయూ మరింత అభివృద్ధి చెందుతుంది.

– లక్ష్మీకాంత్ రాథోడ్, వైస్‌చాన్స్‌లర్, పీయూ

ధాన్యం లెక్కలను పరిశీలించిన హైకోర్టు బృందం



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న అడ్వకేట్ కమిషనర్, అధికారులు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో ఉన్న మీనాక్షి రైస్‌మిల్లులో శుక్రవారం హైకోర్టు అడ్వకేట్ కమిషనర్ బృందం విమల్‌కుమార్ జైన్ ఆధ్వర్యంలో వరి ధాన్యం బస్తాలను లెక్కించారు. ఈ మిల్లుకు సీఎంఆర్ కోసం కేటాయించిన వరి ధాన్యంలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు యజమానిపై అధికారులు కేసు నమోదు చేయడంతో పాటు మిల్లును సీజ్ చేశారు. అధికారులు పేర్కొన్నట్లు సీఎంఆర్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని.. లెక్క ప్రకారం బియ్యం అప్పగించామని, రాజకీయ కక్షతోనే కేసులు నమోదు చేసి మిల్లును సీజ్ చేశారని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు అడ్వకేట్ కమిషనర్ బృందం శుక్రవారం మిల్లులోని ధాన్యం బస్కాలను లెక్కించారు. నిల్వ వివరాలు, అధికారులు తీసుకెళ్లిన ధాన్యం బస్తాల వివరాల పూర్తి నివేదికను హైకోర్టుకు సమర్పించనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అధికారుల వద్ద ప్రస్తావించగా.. హైకోర్టు పరిధిలో ఉండటంతో ఏమి మాట్లాడలేమని బదులిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తిరుపతిరావు, ఆర్డీఓ పద్మావతి, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ అధికారులు బాలూనాయక్, ఫరీదాబేగం, నందకిశోర్, వేణు, ఎస్ఐ వేణు తదితరులు ఉన్నారు.